
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
శుక్రవారం 26 సెప్టెంబరు 2025

మద్యం షాపులకు రిజర్వేషన్లు ఖరారు

- నేటి నుంచి అక్టోబర్ 18 వరకు దరఖాస్తుల స్వీకరణ
- జిల్లాలో అదనంగా పెరిగిన రెండు దుకాణాలు
- ఒక్కో దరఖాస్తుకు రుసుం రూ.3 లక్షలు



నెహ్రూసెంటర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ల్లాలో 2025 డిసెంబర్ 1వ తేదీ నుంచి 30 నవంబర్ 2027 వరకు (రెండు సంవత్సరాలు) మద్యం షాపులకు ఎక్సైజ్‌శాఖ అధికారులు రిజర్వేషన్లను గురువారం ఖరారు చేశారు. జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో డ్రా పద్ధతిన రిజర్వేషన్లను తీశారు. జిల్లాలోని 18 మండలాల పరిధిలో గతంలో 59 మద్యం దుకాణాలు ఉండగా, ప్రస్తుతం కేసముద్రంలో ఒకటి, తొర్రూరులో మరొకటి చొప్పున పెరగడంతో షాపుల సంఖ్య 61కి చేరింది. వాటన్నింటికీ లక్కీడిప్ ద్వారా రిజర్వేషన్లను ఖరారు చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ బాదావత్ కిరణ్‌నాయక్ తెలిపారు. కాగా, గతంలో మద్యం దుకాణాన్ని దక్కించుకునేందుకు దరఖాస్తు చేసుకునేందుకు రూ.2 లక్షలు రుసుం ఉండగా అదనంగా రూ. లక్ష పెంచి రూ.3 లక్షలుగా నిర్ణయించారు. మహబూబాబాద్ జిల్లాలో 61 షాపులకు గాను గౌడ కులస్తులకు 13, ఎస్సీలకు 05, ఎస్టీలకు (నాన్ ఏజెన్సీ) 01, ఎస్టీలకు (ఏజెన్సీ)లో 11, జనరల్‌కు 31 షాపులు రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుంచి అక్టోబర్ 18 వరకు షాపులను దక్కించుకునేందుకు దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వం గడువు విధించింది. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ అనంతరం అక్టోబర్ 23న జిల్లాలోని 61 మద్యం దుకాణాలకు లక్కీడిప్ ద్వారా టెండర్‌దారులను ఎంపిక చేయనున్నారు. మద్యం షాపులు దక్కించుకున్నవారికి డిసెంబర్ 1 నుంచి షాపులను ప్రారంభించుకోనున్నారు.

హాలధారి హ్యాపీ

మరిపెడలో వ్యవసాయ మార్కెట్..!?

- కేసముద్రం మార్కెట్ నుంచి బైఫరికేషన్
- ఏర్పాటుకు రాష్ట్ర సర్కార్ సన్నాహాలు
- ప్రభుత్వానికి అందిన ప్రతిపాదనలు
- ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్ ప్రయత్నాలు
- రెండు నెలల్లోగా ప్రారంభించేందుకు యత్నం



కేసముద్రం వ్యవసాయ మార్కెట్

మహబూబాబాద్ అగ్రికల్చర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మరిపెడ పరిధిలో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. స్థానిక డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోత్ రాంచందర్‌నాయక్ ప్రభుత్వానికి విన్నవించడంతో మరిపెడలో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు మహబూబాబాద్ మార్కెటింగ్‌శాఖ డీఎంవో వెంకటేశ్వర్లు నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు అం దాయి. ప్రభుత్వం ఒప్పుకుంటే నెలకో.. రెండు నెలలకో మార్కెట్ యార్డు ఏర్పాటు చేసి కొనుగోళ్లు ప్రారంభించ డానికి సన్నాహాలు జరుగుతున్నాయి.



కేసముద్రం మార్కెట్ పరిధిలోనే..

కేసముద్రం వ్యవసాయ మార్కెట్ పరిధిలో మరిపెడ మండలంలోని గ్రామాలు కూడా ఉన్నాయి. మహబూబాబాద్‌కు 27 కిలోమీటర్లు ఉన్న మరిపెడను మహబూబాబాద్ మార్కెట్‌లో కలపకుండా 47 కిలోమీటర్ల దూరంలో ఉన్న కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు గతంలోనే కలిపారు. దీనిపై అప్పట్నుంచే కేసముద్రం ప్రాంత వాసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసమే మరిపెడను కేసముద్రం మార్కెట్ పరిధిలో కలిపినట్లు ఆరోపణలు వచ్చాయి. అయినప్పటికి అప్పటి ప్రభుత్వాలు మరిపెడ పరిధిని తొలగించకుండా ఇప్పటి వరకు కొనసాగిస్తూ వస్తున్నారు. మార్కెట్ చైర్మన్ పదవి కేసముద్రం ప్రాంత వాసులకు, వైస్ చైర్మన్ పదవి మరిపెడ ప్రాంత వాసులకు ఇప్పటి వరకు ఎమ్మెల్యేల సహకారంతో అధికారులు కేటాయిస్తూ వచ్చారు. ఇదిలా ఉండగా మార్కెటింగ్ శాఖ పరిధిలో మరిపెడ పట్టణంలోని ప్రధాన రోడ్డు మార్గంలో మార్కెట్ చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఆ చెక్‌పోస్టుపై ఏడాదికి రూ.206 కోట్లకు పైగా ఆదాయం సాధిం చి పెడుతోంది. అయితే 1989లో అప్పటి ప్రభుత్వం ఇక్కడ మా ర్కెట్ ఏర్పాటు చేస్తే బాగుంటుందనే ఉద్దేశంతో బహిరంగ మా ర్కెట్‌ను మరిపెడలో ప్రారంభించారు. ఆ మార్కెట్ కొంతకాలమే నడిచి తిరిగి మూలకు పడిపోయింది. కేవలం ఒక్క చెక్‌పోస్టు మాత్రమే నడుస్తోంది.

ప్రభుత్వానికి అందిన నివేదిక..

డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోత్ రాంచందర్‌నాయక్ ముందుకు మరిపెడలో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేయాలని ఓ ప్రతిపాదనను కొంతమంది నాయకులు తీసుకువచ్చారు. దీం తో ఆయన స్పందించి మరిపెడలో ప్రత్యేకంగా వ్యవసాయ మా ర్కెట్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ఇటీవలనే ఓ నివేదిక సమర్పించారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించింది. ప్రభుత్వం నుంచి మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌కు మరిపెడలో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు అందడంతో మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ నుంచి జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారికి ఉత్తర్వులు అందాయి.

ఈ మార్కెట్ ఏర్పాటుకు కావాల్సిన సదుపాయాలు ఉన్నాయా.! మార్కెట్‌కు ఆదాయం ఎంత వస్తుంది? కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌ను బైఫరికేషన్ చేసి మరిపెడలో ప్రత్యేక మార్కెట్ ఏర్పాటు చేయడానికి కావాల్సిన సిబ్బంది ఏర్పాటుకు, కేసముద్రం మార్కెట్‌లో ఉన్న సిబ్బంది ఎంతమంది.. అనే వివరాలు పంపాలని మార్కెటింగ్ డైరెక్టర్ నుంచి డీఎంవోకు ఉత్తర్వులు అందాయి. దీంతో డీఎంవో కేసముద్రం మార్కెట్‌కు చేరుకుని కార్యదర్శి నుంచి వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. మరోసారి నివేదికలు పంపాలని డైరెక్టర్ నుంచి ఆదేశాలు రావడంతో డీఎంవో మరోసారి నివేదికలు పంపించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఉత్వర్వులు అందితే మరిపెడలో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు రెండు నెలల్లోగా సమయం పట్టే అవకాశం ఉంది. ఈ విషయంపై జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి మరిపెడలో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశాలు వచ్చాయని, ఇప్పటికే ఒకసారి ప్రతిపాదనలు పంపామని, మరోసారి ప్రతిపాదనలు పంపించనున్నట్లు చెప్పారు.

అతిథి అధ్యాపకుల వేతనాలు చెల్లించాలి

- జిల్లా ఇంటర్ విద్యాధికారి మధార్‌గౌడ్‌కు వినతి


మధార్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న అతిథి అధ్యాపకులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్. సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అతిథి అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల వేతనాలు చెల్లించాలని మహబూబాబాద్ జిల్లా గెస్ట్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు గడ్డం రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో జిల్లా ఇంటర్ విద్యాశాఖ కార్యాలయంలో గురువారం డీఐఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 1654మంది గెస్ట్ లెక్చరర్లుగా విధులు నిర్వహిస్తుండగా, వేతనాలు రాక తెలంగాణలో అతిపెద్ద పండుగ బతుకమ్మ, దసరాకు పస్తులుండాల్సిన దుస్థితి నెలకొందన్నారు. గత విద్యాసంవత్సరంలో పెండింగ్‌లో ఉన్న 4 నెలలు, ఈ విద్యాసంవత్సరంలో 4నెలలు మొత్తం 8నెలల వేతనాలు వెంటనే విడుదల చేసి కుటుంబాల్లో సంతోషం నింపాలని ప్రభుత్వాన్ని కోరారు. రెగ్యులర్ అధ్యాపకుల నియామకంతో ఉద్యోగం కోల్పోయిన అతిథి అధ్యాపకులందరికి పోస్టింగ్‌లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో గోవిందు, సుధాకర్, నిమ్మల ప్రేమ్‌శేఖర్, అజ్మీర స్రవంతి పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలి

- సీజనల్ వ్యాధుల పట్ల ముందస్తు చర్యలు తీసుకోవాలి
- ప్రతీ వార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్


కలెక్టర్, ఎస్పీలకు ఆస్పత్రిలో చేపడుతున్న చర్యలను వివరిస్తున్న ఇన్‌చార్జి సూపరింటెండెంట్ జగదీశ్వర్

8

బిల్లు చేయాలంటే లంచం తప్పదన్నాడు..

- ఏసీబీ వలలో ఔట్ సోర్సింగ్ సైట్ ఇంజనీర్
- రూ.8 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత


పట్టుబడ్డ టీజీ-ఈడబ్ల్యూఐడీసీ ఇంజనీర్ సామల రమేష్

8

జిల్లాలో మోస్తరు వర్షం

మహబూబాబాద్ అగ్రికల్చర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు మండలాల్లో ఓ మోస్తరు వర్షం పడింది. డోర్నకల్, బయ్యారం, కేసముద్రం, గూడూరు, గార్ల, మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. పలు మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు చోట్ల ముసురు అలుముకుంది. డోర్నకల్‌లో 45.0, కేసముద్రంలో 28.6, గూడూరులో 27.8, గార్లలో 23.8, బయ్యారంలో 35.8, మహబూబాబాద్‌లో 13.8, కొత్తగూడలో 10.8, గంగారంలో 9.2, కురవిలో 5.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో వర్షం కురియలేదు. జిల్లా మొత్తంలో 200.0 మిల్లీమీటర్ల వర్షం కురియగా, సగటున 12.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

గ్రూప్-1లో మెరిసిన రత్నాలు

ఉమ్మడి జిల్లా నుంచి పలువురు ఉన్నత ఉద్యోగాలకు ఎంపిక

- పేద, మధ్య తరగతి కుటుంబాల నుంచే ఎక్కువ
- పట్టుదలతో ఏళ్ల తరబడి శ్రమించి విజయకేతనం
- 4వ ర్యాంకుతో ఆర్డీవోగా తేజస్వినీ రెడ్డి
- 13వ ర్యాంకుతో డిప్యూటీ కలెక్టర్‌గా తొటం రోహిత్
- డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన జూనియర్ లెక్చరర్ వనజ
- ఏజెన్సీ పల్లె నుంచి ఎంపీడీవోగా కూస రవికుమార్
- డీఎస్పీగా ఎంపికైన పంక్చర్ షాప్ నిర్వాహకుడి కూతురు
- గత ఏడాది తమ్ముడు సివిల్స్... ఇప్పుడు అన్న గ్రూప్-1...
- రఘునాథపల్లిలో ప్రతిభచాటిన కొయ్యడ బ్రదర్స్
- ఆయా కుటుంబాల్లో వెల్లివిరిసిన ఆనందోత్సాహాలు


తేజస్వినిరెడ్డి, తొటం రోహిత్, బానోతు వనజ, కూస రవికుమార్, అల్లెపు మౌనిక, ఉదయ్‌కుమార్, బొక్క సుధీర్

ప్రతిభ వికసించింది.. పట్టుదల ఫలించింది.. 'శ్రమయేవ జయతే' అనే సూక్తి తన శక్తిని చాటింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో ఉమ్మడి జిల్లా నుంచి పలువురు ఉన్నత ఉద్యోగాలు సాధించారు. తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాత మొట్ట మొదటి గ్రూప్-1 నియామకాలు ఎట్టకేలకు కొలిక్కి రావడంతో విజేతల కలలు పలించినట్లయింది. 4వ ర్యాంకుతో జిన్నా తేజస్వినీ రెడ్డి ఆర్డీవో, 13వ ర్యాంకుతో తొటం రోహిత్ డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం సాధించారు. అలాగే జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న వనజ డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. జేడీ మల్లంపల్లిలో పంక్చర్ షాప్ నిర్వాహకుడి కూతురైన మౌనిక ఏకంగా డీఎస్పీ జాబ్ కొట్టింది. రఘునాథపల్లికి చెందిన కొయ్యడ ఉదయ్ మునిసిపల్ కమిషనర్‌గా ఎంపిక కాగా, ఆయన తమ్ముడు ప్రణయ్ గత ఏడాది ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. ఇంకా అనేకమంది ప్రతిభావంతులు ఉత్తమ ర్యాంకులతో కొలువులను కైవసం చేసుకున్నారు. విజేతల్లో ఎక్కువ మంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే కావడం గమనార్హం.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

7

ఆరేళ్ల బాలుడి హత్య

- మెడకు ఉరి బిగించి చంపినట్లుగా ఆనవాళ్లు
- రెండు నెలల క్రితం ఇదే బాలుడిపై కత్తితో హత్యాయత్నం
- నారాయణపురంలో కలకలం
- తమకెవరితో శత్రుత్వం లేదంటున్న తల్లిదండ్రులు


మనీష్ కుమార్ (ఫైల్)

కేసముద్రం, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి) : రెండు నెలల క్రితం హత్యాయత్నానికి గురైన ఓ బాలుడు, తాజాగా గుర్తుతెలియని వ్యక్తుల చేతుల్లో హత్యకు గురయ్యాడు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురంలో గురువారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. తమ ఇంట్లోనే పందుల మనీష్‌కుమార్(6) హత్యకు గురయ్యాడు. ఎస్‌ఐ మురళీధర్‌రాజ్, బాధితులు, గ్రామస్థులు తెలిపిన ప్రకారం... నారాయణపురం గ్రామానికి చెందిన పందుల ఉపేందర్-శిరీష దంపతులకు ముగ్గురు కుమారులు సంతానం. చిన్నకుమారుడు నిహాల్ పదినెలల క్రితం సంపులో పడి మృతి చెందాడు. రెండో కుమారుడు మోక్షిత్ ఉన్నాడు. ఆరేళ్ల పెద్దకుమారుడు మనీష్‌కుమార్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం మనీష్ కుమార్‌కు జ్వరం ఉందని ఇంట్లో పడుకోబెట్టి తల్లి బతుకమ్మ వద్దకు వెళ్లింది. రాత్రి 8 గంటల ప్రాంతంలో బాలుని తాత, నానమ్మ ఇంటికి వచ్చి బాబును లేపేందుకు ప్రయత్నించగా.. చలనం లేకుండా పడి ఉన్నాడు. దీంతో ఇరుగుపొరుగు వారి సహాయంతో స్థానిక ఆర్‌ఎంపీ వద్దకు తీసుకువెళ్లగా మృతి చెందినట్లు చెప్పాడు. అక్కడి నుంచి బాబు మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చారు. రాత్రి తండ్రి ఉపేందర్ బాలుడి మెడపై ఉరివేసినట్లుగా గాట్లు ఉండడం గమనించి, వెంటనే తన సోదరుడికి తెలుపగా ఆయన పోలీసులకు సమాచారం అందించారు. ఉదయం మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, ఎస్‌ఐ మురళీధర్‌రాజ్ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై బాలుని నానమ్మ మంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మిస్టరీగా మారిన హత్య, హత్యాయత్నం..

ఇదిలా ఉండగా గత జూలై 30న రాత్రి ఇదే బాలునిపై గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో దాడి చేసి హత్యయత్నానికి పాల్పడ్డారు. ఆ కేసు మిస్టరీ తేలకముందే తాజాగా హత్యకు గురికావడం కలకలం రేపుతోంది. ఆ కేసును పోలీసులు ఛేదించి ఉంటే ఈ రోజు ఇలా జరిగి ఉండేదని కాదని పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. తమ కుటుంబానికి ఎవరితో శత్రుత్వం లేదని బాధితులు చెబుతుండడంతో అనేక అనుమానాలకు తావిస్తోంది. ఎవరు, ఏ ఉద్దేశంతో బాలున్ని హత్య చేశారనేది మిస్టరీగా మారింది.


మాట్లాడుతున్న మాలోత్ కవిత

ఆత్మగౌరవ సభకు వేలాదిగా తరలిరావాలి

- లంబాడీల జోలికొస్తే ఊరుకోం
- మాజీ ఎంపీ మాలోత్ కవిత

8

కాత్యాయనిదేవిగా అమ్మవారు

మరిపెడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా మరిపెడ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారు గురువారం భక్తులకు కాత్యాయనిదేవిగా దర్శనమిచ్చింది. అర్చకులు ప్రసాద్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపల్లి రవి

తొర్రూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. గురువారం తొర్రూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొర్రూరు మునిసిపాలిటీకి గత ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు కేటాయించామని గొప్పలు చెప్పుకుందే తప్ప ఆచరణలో లేదన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలల నుంచి, డివిజన్ కేంద్రమైన తొర్రూరులో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి నిధులు మంజూరైనా స్థల సేకరణలో జాప్యం చేస్తోందన్నారు. ఇచ్చిన హామీలన్నీ శంకుస్థాపనలకే పరిమితం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని లేకుంటే ఆందోళన చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో వీరన్న, యాకయ్య, కేశవ్, రవి తదితరులు ఉన్నారు.

దీన్ దయాళ్ ఉపాధ్యాయ యువతకు ఆదర్శం



దీన్ దయాళ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తొర్రూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అంత్యోదయ ఆధ్యాత్మిక వేత్త, యువతకు ఆదర్శమూర్తి జనసంఘ్ వ్యవస్థాపకుడు దీన్ దయాల్ ఉపాధ్యాయ అని బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్ అన్నారు. గురువారం దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఎంతో మంది యువతకు ఆదర్శంగా నిలిచిన గొప్ప నేత దీన్ దయాళ్ ఉపాధ్యాయ అని ఆయన ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు రచ్చ కుమార్, పల్లె కుమార్, సంతోష్, నవీన్, భరత్, శ్రీనాథ్, చలపతి, యశ్వంత్, తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



వీరయ్య(ఫైల్)

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన గురువారం తొర్రూరు మండలం హరిపిరాలలో చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తలారి వీరయ్య (60) తన వ్యవసాయ పనుల్లో భాగంగా బోరుమోటర్ వద్ద గడ్డికోస్తుండగా విద్యుత్‌వైర్లకు కొడవలి తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు.

లంబాడీలను మోసం చేస్తే ఊరుకోం..

● మాజీ మంత్రి రెడ్యానాయక్ ● తెగేదాకా లాగితే సుప్రీంకోర్టుకైనా వెళ్తాం.. ● మరిపెడలో లంబాడీల ఆత్మగౌరవ సభ



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి రెడ్యానాయక్

మరిపెడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : లంబడీలను మోసం చేస్తే ఊరుకోమని మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఘాటైనా వ్యాఖ్యలు చేశారు. గురువారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని కేసీఆర్ గ్రౌండ్‌లో డోర్నకల్ నియోజకవర్గ స్థాయి లంబాడీల ఆత్మగౌరవ సభ నిర్వహించగా రెడ్యానాయక్ పాల్గొన్నారు. సీఎంను ఉద్దేశించి మాట్లాడుతూ.. అల్లుడి కోసం లగచర్ల భూములు లంబాడ బిడ్డలనుంచి లాక్కోవడానికి ఆదివాసీలు-గిరిజనుల మధ్య చిచ్చు పెట్టావని ఈ పాపం ఊరకే పోదన్నారు. లంబాడీలు ఎక్కువ ఉన్న ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను గిరిజనులు గెలిపించారని గుర్తు చేశారు. వాళ్లపైనే నీ పైశాచిక చర్యలా..? అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై రెడ్యా మండిపడ్డారు. ఎస్టీ రిజర్వేషన్లపై తేడా వస్తే సుప్రీం కోర్టుకైనా వెళ్తామన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన సోయం బాబురావు, తెల్లం వెంకట్రావ్‌లతో కోర్టులో కేసు వేసి మా జాతుల మధ్య సీఎం రేవంత్‌రెడ్డి వైరుధ్యం పెంచడం ఆయన పరిపాలన చేతగానీతనానికి ఇది ఓ నిదర్శనమన్నారు.ఆదివాసీలకు మంత్రి సీతక్క అండగా ఉండి ఎస్టీ రిజర్వేషన్లు గిరిజనులకు చెందొద్దని లంబాడీలపై యుద్ధం చేస్తుంటే లంబాడోళ్ల ఓట్లతో గెలిచిన గిరిజన ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారు..? గడ్డిపీకుతున్నారా.. అని మండిపడ్డారు.

సీఎం రేవంత్‌రెడ్డి మెప్పు కోసం లంబాడ జాతికి వెన్నుపోటు పొడుస్తున్నారని ఎస్టీ ఎమ్మెల్యేలపై రెడ్యా విమర్శలు గుప్పించారు. డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌పై మాటలతో విరుచుకుపడ్డారు. ఈ సభలో మాలోత్ కవిత మాట్లాడి గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవిచంద్ర, నాయకులు రాంబాబు, గుగులోత్ వెంకన్న, రవీందర్‌నాయక్, మరిపెడ మునిసిపల్ మాజీ చైర్మన్ సింధూరకుమారి, పానుగోత్ వెంకన్న, భూక్యా రామ్మూర్తి, బాలాజీ, రెడ్డి, కిషన్, ఎల్.వెంకన్న, రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ



తొర్రూరు బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న జిల్లా వైద్యాధికారి రవి రాథోడ్

తొర్రూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని జిల్లా వైద్యాధికారి రవి రాథోడ్ అన్నారు. గురువారం తొర్రూరు ప్రభుత్వ ఆస్పత్రిలో మహిళా ఉద్యోగులు నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆయన పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులందరూ ఒకేచోట చేరి బతుకమ్మ వేడుకలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో వైద్యులు సుగుణాకర్ రాజు, నాగేశ్వర్ రావు, నందన, విజయ్‌కుమార్, మీరజ్, మానస తదితరులు ఉన్నారు.

తొర్రూరులోని బీఆర్ఎస్ కార్యాలయంలో మహిళ కార్యకర్తలు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌చైర్మన్ శాంత, కర్నె నాగజ్యోతి, పులమ్మ, కళావతి, సుచరిత, సమ్మక్క, మమత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐదొద్దుల బతుకమ్మ వేడుకలు

మరిపెడ (ఆంధ్రజ్యోతి) : మరిపెడ పట్టణంలో గురువారం ఐదొద్దుల బతుకమ్మ పండుగ వేడుకలను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. మండల పరిషత్ ఆవరణలో పట్టణ మహిళలు, మరిపెడ మునిసిపల్ కార్యాలయంలో మునిసిపాలిటీ సిబ్బంది, మరిపెడ పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది బతుకమ్మ వేడుకలు నిర్వహించి డీజే పాటలకు ఆడి పాడారు. ఈ వేడుకల్లో డీఎంహెచ్‌వో డాక్టర్ రవిరాథోడ్, మునిసిపల్ కమిషనర్ విజయానంద్, పీహెచ్‌సీ డాక్టర్ రవి, వైద్య సిబ్బంది, మునిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి శ్రీమాన్ రాజీనామా



తొర్రూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాలకుర్తి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్, పార్టీ సీనియర్ నాయకుడు, ఆర్‌ఎస్ఎస్, ఏబీవీపీ, బీజేపీలో వివిధ స్థాయిలో నిబద్ధతతో పనిచేసిన తొర్రూరుకు చెందిన పూసల శ్రీమాన్ బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామా లేఖను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుకు గురువారం ఫ్యాక్స్ ద్వారా పంపారు. ఈసందర్భంగా శ్రీమాన్ మాట్లాడుతూ వ్యక్తిగత, ఆర్థిక కారణాలతో పార్టీకి సమయం కేటాయించలేకపోతున్నానని అందుకే పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఇంతకాలం తనకు సహకరించిన పార్టీ కేంద్ర, రాష్ట్ర కమిటీ నాయకులకు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

● డీఎంహెచ్‌వో రవిరాథోడ్

దంతాలపల్లి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేసే వైద్య సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో రవిరాథోడ్ హెచ్చరించారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది రిజిష్టర్లు, వ్యాక్సినేషన్ రిజిష్టర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. సబ్‌సెంటర్ పరిధిలో పని చేసే హెల్త్ సూపర్‌వైజర్లు తప్పక రోజువారీ విధుల్లో భాగంగా ఆయా గ్రామాలను సందర్శించాలన్నారు. పనిదినాల్లో హెచ్‌వీలు పల్లెదవాఖానాలను సందర్శించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి కవిత తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం..

ప్రభుత్వ ఉపాధ్యాయుడి జన చైతన్య యాత్ర



రాష్ట్ర వ్యాప్త జన చైతన్య యాత్ర చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్

దంతాలపల్లి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ రహిత సమాజం కోసం ఓ రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయుడు జన చైతన్య యాత్రను ప్రారంభించాడు. సూర్యాపేట జిల్లా మిర్యాలగూడకు చెందిన రాచకొండ ప్రభాకర్.. మద్దిరాల మండలం గోరెంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు బాషా పండితుడిగా పనిచేస్తున్నాడు. ఈనెల 21న సూర్యాపేట నుంచి బైక్‌పై జన చైతన్య యాత్రను ప్రారంభించాడు. ప్రభాకర్ 22న ఖమ్మం, 23, 24న మధిరతో పాటు ఇతర ప్రాంతాల్లో జనచైతన్య యాత్రను కొనసాగిస్తూ గురువారం దంతాలపల్లికి చేరుకున్నారు. ఈసందర్భంగా స్థానికులు ఆయనకు స్వాగతం పలికారు. యువత మత్తు పదార్థాలనుంచి విముక్తి పొందాలంటే ప్రజల్లో చైతన్యం కల్పించాలన్నారు. ఈనెల 19 నుంచి దసరా సెలువులు ఉండడంతో సమాజ సేవలో భాగంగా అక్టోబరు 3 వరకు యాత్రను కొనసాగించి తిరిగి పాఠశాలకు హాజరవుతానని ఉపాధ్యాయుడు తెలిపారు. ప్రభాకర్ చేస్తోన్న జనచైతన్య యాత్ర సాఫీగా కొనసాగాలని పలువురు ఆకాంక్షించారు.

పాత స్థలంలోనే నూతన భవన నిర్మాణం చేపట్టాలి

దంతాలపల్లి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పాత గ్రామపంచాయతీ భవన స్థలంలోనే నూతన భవనం నిర్మించాలని కోరుతూ గురువారం గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శి ఏశబోయిన వెంకన్నకు వినతిపత్రం అందించారు.

ఈసందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ కొందరు రాజకీయంలో భాగంగా జీపీ భవనాన్ని వేరే చోటకు మార్చేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. ప్రజలందరికీ సౌకర్యంగా ఉన్న పాత జీపీ భవనాన్ని కూల్చి ఉన్నతాధికారుల సూచనల మేరకే నూతన భవన నిర్మాణం చేపట్టాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యాకయ్య, అజయ్, యాకన్న, అర్జున్, రాము, వెంకన్న, ముత్తు, తదితరులు గ్రామస్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగ సమస్యల పరిష్కారంలో విఫలం




ర్యాలీగా వస్తున్న రైతుసంఘం ప్రతినిధులు

బచ్చన్నపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ ఆరోపించారు. గురువారం జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహ ఆవరణలో రైతుసంఘం కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. అంతకుముందు ర్యాలీగా తరలివచ్చి పతాకావిష్కరణ చేశారు. శోభన్ మాట్లాడుతూ వానాకాలంలో రైతులకు బ్యాంకులు రుణాలు అందించటంలో వెనుకబడ్డాయన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ. 2 లక్షల రుణమాఫీ పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. భారీ వర్షాలతో నష్టపోయిన ప్రాంతాల్లో రైతులకు పరిహారం అందజేయాలన్నారు. సమావేశంలో నేతలు రాపర్తి సోమయ్య, భూక్యా చందూ, మినలాపురం ఎల్లయ్య, రవీందర్‌రెడ్డి, రాజవ్వ, బాలనర్సయ్య, బాల్‌రాజు, కుమార్ పాల్గొన్నారు.

పెరిగిన గోదావరి ప్రవాహం



కాళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం



వాజేడు మండలం పూసూరు-ముళ్లకట్ట వంతెన వద్ద గోదావరి

ములుగు/వాజేడు/ఏటూరునాగారం రూరల్/మంగపేట, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి) : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నేపథ్యంలో ములుగు జిల్లాలో గోదావరి ప్రవాహం పెరిగింది. గురువారం ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు మండలాల్లో గోదావరి ఉధృతి స్వల్పంగా పెరుగుతోంది. ఏటూరునాగారం మండలం రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద ప్రవాహం క్రమంగా పెరుగుతూ వస్తోంది. వాజేడు మండలంలోని పేరూరు వద్ద గోదావరి నీటి మట్టం 51 అడుగుల నమోదైంది. కన్నాయిగూడెం మండలం సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద 81.64 మీటర్ల నీటి మట్టం ఉంది. మంగపేట మండలం కమలాపురం బిల్ట్ ఇన్‌టేక్ వద్ద 83 అడుగుల ఎత్తుతో గోదావరి ప్రవహిస్తోంది.

కాళేశ్వరం వద్ద..

మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి ప్రవాహం పెరిగింది. ఎగువన కురుస్తున్న వర్షాలతో గోదావరి, ప్రాణహిత నదుల నుంచి వరద వచ్చి చేరుతోంది. దీంతో కాళేశ్వరం వద్ద 11.29మీటర్ల ఎత్తులో గోదావరి ప్రవహిస్తోంది. అలాగే ములుగు జిల్లాలో గోదావరి ప్రవాహం పెరిగింది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల ప్రభావంతో గోదావరికి వరద చేరుతోంది.

నిలిచిన అంతర్ రాష్ట్ర రాకపోకలు




టేకులగూడెం వద్ద జాతీయ రహదారిపై వరద నీరు

వాజేడు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరదల కారణంగా అంతర్ రాష్ట్ర రాకపోకలు నిలిచిపోయాయి. ములుగు జిల్లా వాజేడు మండలంలోని భూపాలపట్నం-హైదరాబాద్ 163వ జాతీయ రహదారి టేకులగూడెం వద్ద ఉన్న రేకుమాగు వాగుకు వరద నీరు పోటెత్తి జాతీయ రహదారిని ముంచెత్తింది. దీంతో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు రాకపోకలలో అంతరాయం ఏర్పడింది. వాగులను ఎవరూ దాటకుండా పంచాయతీ సిబ్బంది బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నిషేధించారు. అదే విధంగా మండల కేంద్రం నుంచి గుమ్మడిదొడ్డికి వెళ్లే మార్గంలో ఉన్న కొంగాల వాగుకు వరద నీరు పోటెత్తడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

సింగరేణి కార్మిక నేత హఠాన్మరణం

విహారయాత్రలో గుండెపోటు



విజేందర్ (ఫైల్)

గణపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ యూనియన్ అసిస్టెంట్ బ్రాంచి సెక్రటరీ మధుగాని విజేందర్ (56) గుండెపోటుతో గురువారం మృతి చెందారు. తోటి కార్మికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి సింగరేణి పరిధిలోని బస్వరాజుపల్లి 8 ఇన్‌క్లైన్ అండర్‌గ్రౌండ్ గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్న మధుగాని విజేందర్ కార్మిక నేతగా కూడా కొనసాగుతున్నారు. సింగరేణి కాలరీస్ యూనియన్‌లో అసిస్టెంట్ బ్రాంచి సెక్రటరీగా బధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఎనిమిది రోజుల క్రితం విహారయాత్రకు కుటుంబంతో కలిసి కొడైకెనాల్ వెళ్లిన ఆయన గురువారం గుండెపోటుకు గురయ్యారు. అక్కడి ఆస్పత్రికి తరలిస్తుండగానే తుది శ్వాస విడిచారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్ల ఉన్నారు. విజేందర్ మృతితో ఆయన కుటుంబంతోపాటు కార్మిక వర్గంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

భద్రకాళికి జనగామ ఇన్‌చార్జి కలెక్టర్ పూజలు




అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తున్న కలెక్టర్ దంపతులు

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని భద్రకాళి అమ్మవారిని జనగామ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ పింకేష్ కుమార్ దంపతులు దర్శించుకున్నారు. గురువారం రాత్రి ఆలయానికి చేరుకున్న కలెక్టర్ దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం కలెక్టర్ దంపతులకు ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.

అదుపుతప్పి కారు బోల్తా

కొడకండ్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి కారు బోల్తా పడిన ఘటన జనగామజిల్లా కొడకండ్ల మండలం రామవరం చెరువు వద్ద గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ రాజు కథనం ప్రకారం. రామవరంనకు చెందిన శివరాత్రి మహేష్ బుధవారం అర్ధరాత్రి మద్యం తాగి కొడకండ్ల నుంచి స్వగ్రామమైన రామవరంకి వస్తున్నాడు. కారును అతివేగంతో నడపడంతో అదుపుతప్పి చెరువు మత్తడి కాలువలో బోల్తా కొట్టింది. ఈ సంఘటనలో కారులో మహేష్ ఒక్కడే ఉండగా, స్వల్ప గాయాలయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

బాధ్యతలు స్వీకరించిన ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్



జనార్దన్

ఏటూరునాగారం రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా(డీడీ) నియమితులైన దబ్బకట్ల జనార్దన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఐటీడీఏ కార్యాలయంలోని తన చాంబర్‌లో చార్జి తీసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తానని అన్నారు. అనంతరం డీడీని గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం నాయకులు పొదెం కృష్ణప్రసాద్, నల్లబోయిన కోటయ్య, శ్రీనివాస్, శ్యామ్, కేశవరావు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మార్కెట్‌కు ఆరు రోజుల సెలవు

జనగామ రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జనగామ వ్యవసాయ మార్కెట్‌కు ఆరు రోజులు సెలవులు ఉన్నందున మార్కెట్ యార్డు బంద్ చేయడం జరుగుతుందని మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 28న ఆదివారం సాధారణ సెలవు, 29న సద్దుల బతుకమ్మ, 30న దుర్గాష్టమి, అక్టోబరు 1న మహర్నవమి, 2న గాంధీ జయంతి, విజయదశమి, 3న విజయదశమి మరుసటి రోజు సందర్భంగా సెలవు ప్రకటించినట్టు పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించి రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించొద్దని సూచించారు. అక్టోబరు 4న మార్కెట్ యథాతథంగా కొనసాగుతుందన్నారు.

పట్టపగలే ఇసుక రవాణా



ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

కొడకండ్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని రెవెన్యూ, పోలీస్ అధికారులు హెచ్చరిస్తున్న కూడా ఇసుకాసురులు ఆగడం లేదు. పట్టపగలే ఇసుకను తరలిస్తున్నారు. జనగామ జిల్లా కొడకండ్ల మండలం బోడేనికుంట తండా గ్రామం మీదుగా దాదాసాహెబ్ కాలానికి చెందిన పదుల సంఖ్యలో ట్రాక్టర్లు రాత్రి 11గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఎలాంటి అనుమతులు లేకుండా సమీప వాగు నుంచి ఇసుకను తోడి ట్రాక్టర్ల ద్వారా వివిధ గ్రామాలకు తరలిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇసుకను తరలిస్తున్నమని చెప్పి సమీప మండలాలకు రూ.5వేల నుంచి రూ.7వేల వరకు అమ్ముకుంటు సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7350	5300
మక్కలు	2026	1521
కందులు	4669	3022
పెసళ్లు	5222	3022
పల్లికాయ (సూక)	6400	3500
పల్లికాయ (పచ్చిది)	4100	2400
పసుపు (కాడి)	7779	7589
పసుపు (గోల)	7306	6996
తేజ మిర్చి	10000	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	15100	12000
యూఎస్341ఏసీ	14700	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

తమ్ముడు ఐఏఎస్..
అన్న మునిసిపల్ కమిషనర్..

● గ్రూప్-1లో 332 ర్యాంకు సాధించిన కొయ్యడ ఉదయ్‌కుమార్



రఘునాథపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లాలోని రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన కొయ్యడ ఉదయ్‌కుమార్ గ్రూప్-1 ఫలితాల్లో 332 ర్యాంకు సాధించి గ్రేడ్-2 మునిసిపల్ కమిషనర్‌గా ఎంపికయ్యారు. ప్రభాకర్-లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు కాగా, చిన్నకుమారుడు ప్రణయ్‌కుమార్ గత ఏడాది సివిల్స్‌లో 554వ ర్యాంకు సాధించి ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం నారాయణఖేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. తమ్ముడి స్ఫూర్తితో ఉదయ్ కూడా పట్టువదలకుండా శ్రమించి గ్రూప్-1 విజేతగా నిలిచారు. ఉదయ్ మొన్నటి వరకు సింగరేణి పర్సనల్ మేనేజర్‌గా పనిచేశారు. ఉదయ్ తండ్రి గతంలో ఓ ప్రైవేట్ స్కూల్‌ను నిర్వహించారు. తల్లి గృహిణిగా ఉన్నారు. ఒకే కుటుంబం నుంచి ఇద్దరు ఉన్నతాధికారులుగా ఎంపిక కావడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

డిప్యూటీ కలెక్టర్‌గా రోహిత్



భీమదేవరపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భీమదేవరపల్లికి చెందిన తౌటం రోహిత్ నేత గ్రూప్-1లో 515 మార్కులతో 13వ ర్యాంకు సాధించాడు. తండ్రి తౌటం సురేందర్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తుండగా, రాధిక గృహిణిగా ఉన్నారు. రోహిత్ 8వ తరగతి నుంచి పదో తరగతి వరకు గోదావరిఖనిలో చదువుకున్నాడు. ఇంటర్మీడియట్, బీటెక్ హైదరా బాద్‌లో పూర్తి చేశాడు. ఒక సంవత్సరం పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేసిన రోహిత్.. రెండుసార్లు సివిల్స్ పరీక్షలు రాశాడు. కలెక్టర్ కావాలనే లక్ష్యంతో సివిల్స్ రాసి ర్యాంకు వచ్చినా మెయిన్స్‌కు చేరుకోలేక పోయాడు. గ్రూప్-1 మొదటి ప్రయత్నంలోనే 13వ ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టర్‌కు ఎంపికయ్యాడు. రోహిత్ సోదరి బీటెక్ పూర్తిచేసి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు.

డీఎస్పీగా ప్రవీణ్‌కుమార్



ఏటూరునాగారం రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏటూరునాగారానికి చెందిన దైనంపల్లి ప్రవీణ్ కుమార్‌కు గ్రూప్-1లో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(డీఎస్పీ)గా ఎంపికయ్యారు. ప్రవీణ్ 105వ ర్యాంక్ సాధించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన ప్రవీణ్ డీఎస్పీగా ఎంపిక కావడంపట్ల స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది. బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన ప్రవీణ్ నానమ్మ సంరక్షణలో ఉన్నాడు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో ఉంటూ పీజీ పూర్తి చేశాడు. హైదరాబాద్‌లోనే ఓ కోచింగ్ సెంటర్‌లో గ్రూప్-1 శిక్షణ పొందాడు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ప్రవీణ్ పేదరికంలోనూ ఉన్నత చదువులు చదివి గ్రూపు-1లో మెరిశాడు. యూపీఎస్సీ మెయిన్ పరీక్షలు కూడా రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తున్నాడు.

జూనియర్ లెక్చరర్ టూ డిప్యూటీ కలెక్టర్

● గ్రూప్-1లో 38వ ర్యాంకు సాధించిన బానోతు వనజ

● చదువుకు పేదరికం అడ్డంకి కాదని నిరూపించిన ధీర



బానోతు వనజ



వనజను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శరద్వతి, సహచర లెక్చరర్లు

గిర్మాజిపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): 'సాధన చేస్తే సాధ్యం కానిది ఏమీ ఉండదు.. నాలుగేళ్లుగా సివిల్స్, గ్రూప్స్ ప్రిపేరవుతున్నా.. మెయిన్స్ రాశాను.. గ్రూప్స్‌పై ఫోకస్ పెట్టడంతో 38వ ర్యాంకు సాధించా.. డిప్యూటీ కలెక్టర్ పోస్టుకు ఎంపికయ్యా..' అని గ్రూప్-1 విజేత బానోతు వనజ తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా గత మార్చిలో ప్రభుత్వ జూనియర్ లెక్చరర్‌గా ఎంపికైన వనజ ప్రస్తుతం నగరంలోని కృష్ణకాలనీ ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో సివిక్స్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గత ఏడాది నిర్వహించిన గ్రూపు-1 పరీక్షల్లో వనజ 504.45 మార్కులతో డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సంతోషాన్ని విజయాన్ని గురువారం 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

సివిల్స్ సాధించడమే లక్ష్యం..

'వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన నేను సివిల్స్ సాధించాలనే లక్ష్యంగా పెట్టుకున్నాను. గ్రూపు-1 పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకుతో డిప్యూటీ కలెక్టర్ పోస్టు సాధించడం చాలా సంతోషంగా ఉంది. టార్గెట్ ఐఏఎస్ సాధిస్తాననే నమ్మకం వచ్చింది. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో పీజీ చేస్తున్నప్పటి నుంచి సివిల్స్ లక్ష్యంగా కార్యాచరణ మొదలు పెట్టా. సివిల్స్ కోసం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ ప్రభుత్వ ఎస్టీ స్టడీ సర్కిల్‌లో కోచింగ్ తీసుకున్నాను. సివిల్స్ మెయిన్స్ రాసినప్పటికీ ఫోకస్ అంతా గ్రూప్-1పై పెట్టాను. తన మొదటి విజయం ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ పోస్టు, రెండో విజయం గ్రూప్-1 డిప్యూటీ కలెక్టర్, మూడో విజయం సివిల్స్ ఐఏఎస్ వస్తుంది..' అని వనజ ధీమాగా చెప్పారు. తెలంగాణ ప్రభుత్వ ఎస్టీ స్టడీ సర్కిల్‌లో తనతో పాటుగా 30 మంది గ్రూప్-1లో విజయం సాధించారని, తామంతా పేద, వ్యవసాయ కుటుంబానికి చెందిన వారమేనని తెలిపారు.

కాగా, వనజను కృష్ణకాలనీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శరద్వతి, కళాశాల స్టాఫ్ సెక్రటరీ మాడుగుల శ్రీనివాసవర్మ, అధ్యాపకులు ప్రిన్సిపాల్ చాంబర్‌లో గురువారం సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు వనమాల, ప్రవళిక, లెక్చరర్లు హరికృష్ణ, రమణారెడ్డి, కరుణశ్రీ, హేమలత, నజియా సుల్తానా, ఉమాదేవి, సంగీత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ స్కూల్ నుంచి డిప్యూటీ కలెక్టర్‌గా..

మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండలం లింగపురం గ్రామానికి చెందిన వ్యవసాయదారుడు బానోతు దశరథ్ నాయక్-లలిత దంపతులకు ముగ్గురు అమ్మాయిలు. ఇందులో మొదటి అమ్మాయి చంద్రకళ ప్రభుత్వ టీచర్, రెండో అమ్మాయి రోజా గృహిణి, మూడో అమ్మాయి వనజ డిప్యూటీ కలెక్టర్. వనజ 10వ తరగతి వరకు దండేపల్లి జిల్లా పరిషత్ స్కూల్‌లో, ఇంటర్ కరీంనగర్‌లో, డిగ్రీ కాకతీయ యూనివర్సిటీ దూర విద్యలో, ఎంఏ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో పూర్తిచేశారు.

ఎంపీడీవోగా కూస రవికుమార్

● గ్రూప్-1లో 104వ ర్యాంకు

● స్వస్థలం కొత్తగూడ మండలం ఎదుళ్లపల్లి





తల్లిదండ్రులు, భార్యతో కూస రవికుమార్

కొత్తగూడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో కొత్తగూడ మండలం ఎదుళ్లపల్లి గ్రామానికి చెందిన కూస రవికుమార్ ఎంపీడీవోగా ఎంపికయ్యారు. ఆయన 104వ ర్యాంకును సాధించాడు. ఎదుళ్లపల్లి గ్రామానికి చెందిన కూస కొమురయ్య-రమ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు సంతానం. వీరిది వ్యవసాయ కుటుంబం. రవికుమార్ 10వ తరగతి వరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించారు. ఇంటర్ కొత్తగూడ జూనియర్ కళాశాలలో, వరంగల్‌లోని తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేశారు. ప్రస్తుతం ఎఫ్‌సీఐలో గ్రేడ్-3 ఆఫీసర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. ఈ ఉద్యోగం చేస్తూనే గత ఐదేళ్లుగా గ్రూప్-1కు సన్నద్ధమై విజయం సాధించారు.

ఆర్డీవోగా తేజస్విని రెడ్డి

● గ్రూప్-1 ఫలితాల్లో 4వ ర్యాంకు

● స్వస్థలం మాందారిపేట



వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్-1 ర్యాంకుల్లో హనుమకొండ జిల్లా వాసి జిన్నా తేజస్విని రెడ్డి 4వ ర్యాంకు సాధించి ఆర్డీవో ఉద్యోగానికి ఎంపికయ్యారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని మాందారిపేట గ్రామానికి చెందిన వ్యవసాయ కుటుంబానికి చెందిన జిన్నా విజయ్‌పాల్‌రెడ్డి - హేమలత దంపతుల కూతురు తేజస్వినిరెడ్డి 532.5 మార్కులు పొంది రాష్ట్ర స్థాయిలో నాలుగో ర్యాంకు సాధించి ఆర్డీవోగా ఎంపికయ్యారు. తేజస్వినిరెడ్డి 2019లో నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలో అర్హత సాధించి ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో మండల పంచాయతీ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలో పంచాయతీ అధికారిగా పనిచేశారు.

డీఎస్పీగా ఎంపికైన
పంక్చర్ షాప్ యజమాని కూతురు



ములుగుటౌన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో ములుగు జిల్లా జేడీ మల్లంపల్లి మండల కేంద్రానికి చెందిన అల్లెపు మౌనిక 315వ ర్యాంక్ సాధించి డీఎస్పీగా ఎంపికైంది. అల్లెపు సమ్మయ్య, సరోజన పెద్ద కూతురు మౌనిక. తండ్రి సమ్మయ్య స్థానికంగా టైర్ పంక్చర్ షాప్‌ను నిర్వహిస్తూ భార్య ఇద్దరు కూతుళ్లను పోషించుకుంటున్నాడు. తల్లి సరోజన వ్యవసాయ కూలీ. మౌనిక 2020లో హైదరాబాద్‌లో డిగ్రీ (బీఏ ఈపీపీ) పూర్తి చేసింది. కుటుంబ ఆర్థిక పరిస్థితుల రీత్యా ఇంటి వద్దే ఉంటూ గ్రూప్-1కు ప్రిపేరైంది. బీసీ-ఏ వడ్డెర సామాజిక వర్గానికి చెందిన మౌనిక 2024లో పరీక్ష రాసి రాష్ట్రంలో 315వ ర్యాంకు సాధించింది.

ఎంపీడీవోగా బొక్క సుధీర్



భీమదేవరపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భీమదేవరపల్లి మండలం ధర్మారం గ్రామానికి చెందిన బొక్క సుధీర్ గ్రూప్-1 పరీక్షల్లో ఎంపీడీవో ఉద్యోగం సాధించాడు. ధర్మారం గ్రామానికి చెందిన బొక్క సుధాకర్-జయ దంపతులకు సుధీర్, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కూతుళ్లకు వివాహం జరిగింది. సుధీర్ పదోతరగతి వరకు సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో చదువుకున్నాడు. ఇంటర్మీడియట్, బీటెక్ హనుమకొండ పూర్తి చేశాడు. 2023 నుంచి సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. గ్రూప్-1 పరీక్షల్లో సుధీర్‌కు 437.5మార్కులు రాగా, 993వ ర్యాంకు వచ్చింది. సుధీర్‌కు ఎంపీడీవో ఉద్యోగం వచ్చింది.



దసరా పండుగ ఆఫర్‌పై సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న అప్పల్‌రావుపేట గ్రామస్థులు

వంద కొట్టు..
పోతు పట్టు..

● అప్పల్‌రావుపేటలో దసరా పండుగ ఆఫర్

నెక్కొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో దసరా పండుగ అంటేనే సుక్కా ముక్కతోటే ప్రారంభమవుతుందని నానుడి. ఈ క్రమంలో వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అప్పల్‌రావుపేట గ్రామంలోని కొందరు వ్యక్తులు దసరా పండుగ ఆఫర్‌అంటూ.. వంద కొట్టు.. పోతును పట్టు.. అంటూ లక్కీ డ్రా కూపన్లు విక్రయిస్తున్నారు. వంద రూపాయలతో కూపన్ కొంటే లక్కీ డ్రాలో మొదటి బహుమతి మేకపోతు, రెండవ బహుమతి మద్యం బాటిళ్లు, కన్సోలేషన్ బహుమతులుగా కోడిపుంజు, చేపలు, తాటికల్లు, శీతల పానియాలతో పాటు తదితర 30 రకాల బహుమతులు ఉంటాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. లక్కీ డ్రా అక్టోబరు ఒకటిన ఉంటుందని ప్రచారం జరుగుతోంది.



అన్నారం షరీఫ్‌లో అంబేద్కర్ సెంటర్‌లో విగ్నేష్ నాయక్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

వంద కొట్టు..
యాటను పట్టు..!

● దసరా పండుగకు బంపర్ ఆఫర్లు

● అన్నారం తండా యువకుడి వినూత్న ఆలోచన

పర్వతగిరి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్ తండాకుచెందిన భూక్యా విగ్నేష్ నాయక్ దసరా పండుగ సందర్భంగా వినూత్న స్కీంకు శ్రీకారం చుట్టాడు. పండుగ ప్రత్యేతను అందరూ గుర్తుంచుకునేలా చేయాలని భావించి రూ. 100 కూపన్ ఆధారంగా లక్కీ డ్రా నిర్వహిస్తున్నట్లు ప్రకటించాడు. ఈ స్కీంలో ఎవరైనా ఎన్ని కూపన్లు కావాలన్నా కొనుగోలు చేయొచ్చని తెలిపాడు. దసరా రోజున ప్రజల సమక్షంలోనే లక్కీ డ్రా నిర్వహిస్తానని తెలిపాడు.

బహుమతులు ఇవే..

లక్కీ డ్రాలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి యాటపోతు, రెండో బహుమతి రెండు బ్లెండర్స్ ఫుల్ బాటిల్లు, మూడో బహుమతి పెట్టె బీర్లు, నాలుగో బహుమతి రెండు చీరలు, ఐదో బహుమతి రెండు నాటుకోడి పుంజులు ఇవ్వనున్నట్లు స్పష్టం చేశాడు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తూ ఈ స్కీంలో చేరడానికి ప్రజలు ముందుకు రావాలని కోరుతున్నాడు.

దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు

» వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్

» కేయూలో నెలవారీ నేర సమీక్షా సమావేశం



నేర సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్

వరంగల్ క్రైం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): దొంగతనాలకు పాల్పడిన వ్యక్తులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి చోరీ సొత్తును వేగంగా రికవరీ చేయాలని అధికారులను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశించారు. గురువారం కాకతీయ యూనివర్సిటీ సమావేశ ప్రాంగణంలో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసులపై సమీక్ష చేయడంతో పాటు పెండింగ్‌కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. చోరీలకు పాల్పడిన నిందితులు దేశంలో ఎక్కడ ఉన్నా పట్టుకునే విధంగా ప్రణాళిక రూపొందించి చోరీ సొత్తును వేగంగా బాధితులకు అందించినప్పుడే పోలీసులపై ప్రజలకు గౌరవం ఉంటుందన్నారు. వివిధ కేసుల్లోని నిందితులను అరెస్టు చేయడంలో పోలీసులు అలసత్వం వహించొద్దని, నేరాల నియంత్రణకు ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. నిందితులకు కచ్చితంగా శిక్ష పడేలా పోలీసుల దర్యాప్తు ఉండాలన్నారు. నేర చరిత్ర ఉన్న వ్యక్తుల ప్రస్తుత స్థితిగతుల వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులను ట్రాఫిక్ పోలీసులతోపాటు లా అండ్ ఆర్డర్ పోలీసులు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. పోలీస్ స్టేషన్‌లలో ఆహ్లాదకర వాతావరణం కోసం మొక్కల పెంపకంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దీనికోసం వారంలో ఒకరోజు శ్రమదానం నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, వరంగల్, జనగామ ఏఎస్పీలు శుభం, చేతన్ నితిన్, అదనపు డీసీపీలు రవి, ప్రభాకర్‌రావు, బాలస్వామి పాల్గొన్నారు.

నిట్‌కు రెండో క్యాంపస్ అవసరం

● మరో 150 ఎకరాల స్థలం కేటాయించాలి

● ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి డైరెక్టర్ సుబుధి లేఖ

● ధర్మసాగర్, మడికొండ, జనగామ ప్రాంతాలను పరిశీలించాలని వినతి

హనుమకొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్‌కు అనుబంధంగా రెండో క్యాంపస్ ఏర్పాటు చేయడానికి 150 ఎకరాల స్థలం ఇప్పించాలని కోరుతూ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి గురువారం లేఖ రాసారు. నిట్ కార్యకలాపాలను విస్తరించడానికి వీలుగా నిట్‌కు దగ్గర్లోని ధర్మసాగర్, మడికొండ లేదా జనగామ జిల్లా సమీపంలో స్థలాన్ని కేటాయించాలని డైరెక్టర్ ఆ లేఖలో కోరారు. ప్రస్తుతం, దేశ, విదేశాలకు చెందిన 8వేల మంది విద్యార్థులు ప్రస్తుతం నిట్‌లో విద్యనభ్యసిస్తున్నారని, నూతన జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా రానున్న రోజుల్లో వీరి సంఖ్య 10వేలకు పెరగవచ్చునని తెలిపారు. 240 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న స్థలం నిట్‌లో వివిధ శాఖల భవనాల నిర్మాణం, పరిశోధనాలయాల ఏర్పాటు ఇతరత్రా కట్టడాలతో పూర్తిగా నిండిపోయిందని, భవిష్యత్తులో చేపట్టబోయే విద్య, పరిశోధన కార్యకలాపాలకు అవసరమైన భవనాల నిర్మాణానికి స్థలం సరిపోక ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. రూర్కీ ఎన్ఐటీ మాదిరిగా అదనపు క్యాంపస్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.


వరంగల్ నిట్ భవిష్యత్ ప్రణాళికలు, సాధ్యశ్యాల మేరకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ), క్వాంటమ్ కంప్యూటింగ్, బ్లాక్ చైన్, ఏఆర్/వీఆర్, సైబర్ సెక్యూరిటీ, డ్రోన్స్, రోబోటిక్స్, ఐఓటీ, 3డి ప్రింటింగ్, జియోస్పాటియల్ టెక్నాలజీస్, స్మార్ట్ మొబిలిటీ, ఈ-లెర్నింగ్, ఎంఎస్ఎంఈ మద్దతు వ్యవస్థలు, స్టార్టప్ ఇంక్యుబేషన్ తదితర రంగాల్లో సరికొత్త ఆవిష్కరణలు, పరిశోధన, విద్య కార్యక్రమాలను చేపట్టడంతో పాటు సుమారు రూ.650కోట్ల వ్యయంతో రీసెర్చ్ పార్క్‌ను కూడా ఏర్పాటు చేయాల్సి ఉన్న దృష్ట్యా అదనంగా స్థలం అవసరమని డైరెక్టర్ తన లేఖలో వివరించారు. నవకల్పనలకు, ఎంటర్‌ప్రెన్యూవర్‌షిప్, ఉపాధి అవకాశాల విస్తరణకు ఇది ఒక ప్రాంతీయ హబ్‌గా దోహదపడుతుందన్నారు. ఈ ప్రాంత సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తుందని పేర్కొన్నారు. పరిశ్రమల అనుసంధానం, పరిశోధనలు, విద్యార్థుల ఇంటర్న్‌షిప్, ప్లేస్‌మెంట్ అవకాశాల మెరుగుకు వీలుగా నిట్‌కు అనుబంధంగా రెండో క్యాంపస్ ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నామని వివరించారు.

అధునాతన హంగులతో జంక్షన్ అభివృద్ధి

» పట్టణాన్ని తలపించేలా ఎల్కతుర్తి అభివృద్ధి

» వచ్చే ఏడాది ట్రిపుల్ ఐటీ, వంగరలో నవోదయ

» రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్



ఎల్కతుర్తి జంక్షన్‌లో సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి, కలెక్టర్లు స్నేహశబరీష్, హైమావతి

ఎల్కతుర్తి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రూ.5కోట్ల కుడా నిధులతో ఎల్కతుర్తి జంక్షన్ సుందరీకరణ పనులను చేపట్టినట్లు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ తెలిపారు. గురువారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో కుడా ఆధ్వర్యంలో చేపట్టిన ఎల్కతుర్తి జంక్షన్ సుందరీకరణ పనులతోపాటు సెంట్రల్ లైటింగ్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, హనుమకొండ, సిద్ధిపేట జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, హైమావతి, కుడా కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్‌లతో కలిసి పరిశీలించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ.. పట్టణాన్ని తలపించేలా ఎల్కతుర్తిని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఎల్కతుర్తిలో 132 సబ్ స్టేషన్ నిర్మాణానికి అన్ని అనుమతులు పొందామన్నారు. ఎల్కతుర్తి జంక్షన్ నుంచి మడిపెల్లి రోడ్డును సైతం నిర్మించనున్నట్లు తెలిపారు. ఇక్కడ త్వరలోనే కోర్టు ఏర్పాటు చేయడానికి స్థల సేకరణ చేస్తున్నామన్నారు. అలాగే ట్రిపుల్ ఐటీని వచ్చే యేడాది ఎల్కతుర్తిలో ఏర్పాటు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

ప్రతీ ఎకరాకు సాగునీరు

ఎస్సారెస్పీ, దేవాదుల, గౌరవెల్లి ప్రాజెక్టుల ద్వారా ప్రతీ ఎకరాకు సాగు నీరు అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఒక్కొక్కటిగా అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, మురికి కాలువలతో పాటు అన్ని మౌలిక వసతులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో 150 పడకల ఆస్పత్రిని 250 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసుకోవడంతో పాటు ఆరోగ్య శాఖ మంత్రి 50 పీజీ సీట్లను కేటాయించారన్నారు. వంగరలో నవోదయ విద్యాలయానికి స్థలం ఎంపిక చేశామన్నారు. హుస్నాబాద్‌లో శాతవాహన యూనివర్సిటీని ఏర్పాటు చేసుకోవడంతో పాటు ఐదు కోర్సులతో తరగతులు నిర్వహించుకోనున్నామన్నారు. కోహెడలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఏర్పాటు చేసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కుడా పీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు, ఆర్డీవో రమేష్‌రాథోడ్, తహసీల్దార్ ప్రసాద్‌రావు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, టీపీసీసీ సభ్యుడు అశోక్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ సుకినే సంతాజీ, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వీరమల్ల రంజిత్‌రెడ్డి, నాయకులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఇన్‌చార్జి ఆర్జేడీగా గోపాల్



వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ విద్య ఇన్‌చార్జి వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్‌గా అజ్మీర గోపాల్‌ను నియమిస్తూ ఇంటర్ బోర్డు డైరెక్టర్ కృష్ణాధిత్య గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇన్‌చార్జి ఆర్జేడీగా నియమితులైన గోపాల్‌కు వరంగల్ నోడల్ ఆఫీసర్ శ్రీధర్ సుమన్‌తో పాటు హనుమకొండ డీఐఈవో కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్నికలను సమర్థంగా నిర్వహించాలి

● వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలవిధులు నిర్వర్తించనున్న రిటర్నింగ్ అధికారులకు, సహాయ రిటర్నింగ్ అధికారులకు రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు, జిల్లా శిక్షణ నోడల్ అధికారి ఆధ్వర్యంలో గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు తూ.చ తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులు జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. నోటిఫికేషన్ జారీ చేసిన తక్షణమే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కావాలన్నారు. అభ్యర్థులు ఎన్ని నామినేషన్లు సమర్పించినా వాటిని పూర్తిగా పరిశీలించి, ఆమోదించినవి, తిరస్కరించినవి, తిరస్కరణకు గల కారణాలను స్పష్టంగా ప్రకటించాలని సూచించారు. ఎన్నికలు పూర్తిగా నిబంధనలకు అనుగుణంగా నిర్వహించి పోలింగ్, కౌంటింగ్ సమయంలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో రామిరెడ్డి, డిప్యూటీ సీఈవో, జిల్లాలోని ఎన్నికల రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పసికందు విక్రయం కేసులో నలుగురి అరెస్టు

చెన్నారావుపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నెక్కొండ మండలంలోని టేకులకుంట తండాలో పసికందు విక్రయం కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై రాజేష్‌రెడ్డి గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఇదే తండాకు చెందిన యాకుబ్- మౌనిక దంపతుల మూడు నెలల పాపను కరీంనగర్ జిల్లా కట్టారామ్‌పూర్‌కు చెందిన కల్పన- రవి దంపతులకు ఇటీవల విక్రయించారు. ఈ విషయాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గ్రామంలో విచారణ చేపట్టి యాకుబ్, మౌనిక, కల్పన, రవి నలుగురిపై కేసు నమోదు చేసుకొని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రాష్ట్రస్థాయి కవి సమ్మేళనంలో ఓరుగల్లు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం బతుకమ్మ పండగను అధికారికంగా నిర్వహింపజేస్తున్న క్రమంలో ఈసారి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బతుకమ్మపై బుధవారం రాత్రి ప్రత్యేక కవిసమ్మేళనాన్ని నిర్వహించింది. ఇందులో కవయిత్రులతో పాటు కవులను కూడా ఆహ్వానించారు. ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఇటీవలే కాళోజీ పురస్కారాన్ని అందుకున్న నెల్లుట్ల రమాదేవి, డాక్టర్ దేవుపల్లి వాణి, గట్టు రాధిక మోహన్, బండారు సుజాత, అరుణ కీర్తిపతాక, డాక్టర్ పి.మాలతీలతతోపాటు పొట్లపల్లి శ్రీనివాసరావు, బిల్ల మహేందర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవీంద్రభారతిలో ఇటీవల సాంస్కృతిక శాఖ సంచాలకులుగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డిని కలిసి అభినందించారు.



సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డిని అభినందిస్తున్న వరంగల్ కవులు

భార్య కాపురానికి రావడం లేదని.. భర్త ఆత్మహత్య


మంగీలాల్ (ఫైల్)

గూడూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన భర్త పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గూడూరు మండలం కోబల్ తండాలో గురువారం చోటు చేసుకుంది. గూడూరు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. కోబల్‌తండాకు చెందిన గుగులోతు మంగీలాల్ (35)కు లైన్‌తండాకు చెందిన కాంతమ్మతో పదిహేను ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి సాయిచరణ్, దినేందర్‌లు సంతానం. ఈ నెల 15న భార్యాభర్తల మధ్య చిన్న ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో కాంతమ్మ తన పిల్లలతో సహా పుట్టింటికి వెళ్లింది. 17న మంగీలాల్ లైన్‌తండాకు వెళ్లి ఇంటికి రావాలని తన భార్యను పిలిచాడు. పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ చేసిన తర్వాతనే వస్తానని చెప్పడంతో మనస్తాపం చెందిన మంగీలాల్ పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్సనందిస్తున్నారు. అక్కడ చికిత్స పొందుతూ.. పరిస్థితి విషమించి గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తల్లి శాంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు చేయించిన వివేక్

గూడూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గూడూరు జూనియర్ కళాశాలకు వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలమయమై బురదమయంగా మారింది. గత రెండ్రోజుల క్రితం డీఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు వివేక్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు కళాశాలకు వెళ్లే రహదారి బురదమయంగా ఉందని చెప్పడంతో ఇందుకు స్పందించిన వివేక్ తన సొంత ఖర్చులతో రోడ్డుపై కంకరడస్ట్‌ను పోయించి, గుంతలను పూడ్చి మరమ్మతు పనులను చేయించి రోడ్డును బాగు చేయించారు. డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు దేవేందర్, మండల నాయకులు వీరేష్, నవీన్, హరి, జగన్, గణేష్ పాల్గొన్నారు.

వ్యాపారవేత్త నాళ్ల వీరన్నకు అచీవర్స్ అవార్డు



వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నాళ్ల వీరన్న

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన సీఆర్ఐ పంప్స్ డీలర్, ప్రకాశ్ ఎలక్ట్రికల్స్ అధినేత, ప్రముఖ వ్యాపారవేత్త నాళ్ల వీరన్న అచీవర్స్ అవార్డు అందుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో నిష్ణాతులైన 16 మందిని ఓ టెలివిజన్ సంస్థ అవార్డులకు ఎంపిక చేసి అందించింది. అందులో భాగంగా వ్యాపారరంగంలో రాణిస్తూ, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించిన వ్యాపారవేత్త నాళ్ల వీరన్నకు అవకాశం దక్కింది. హైదరాబాద్‌లో బుధవారం రాత్రి జరిగిన ఓ కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేతుల మీదుగా వీరన్నకు అచీవర్స్ అవార్డును అందజేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మల్కాజీగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు.

'మానుకోట లేబర్ ఆఫీస్ పరిధికి కేసముద్రాన్ని మార్చాలి'

కేసముద్రం, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ లేబర్ కార్యాలయ పరిధిలోకి కేసముద్రం మండలాన్ని మార్చాలని కోరుతూ ఏఐసీటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రిపెల్లి మొగిళి ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఎంఆర్ఐ సౌజన్యకు వినతపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మొగిళి మాట్లాడుతూ 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న మహబూబాబాద్ కార్మిక శాఖ కార్యాలయం నుంచి కేసముద్రాన్ని 32 కిలోమీటర్ల దూరంలోని తొర్రూరు పరిధికి మార్చారని తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాటోత్ బిచ్యానాయక్, వాంకుడోత్ మొగిళి, ఎడ్ల శ్రీను, మాధవి పాల్గొన్నారు.

బయో మైనింగ్ ప్లాంటును సందర్శించిన ఆర్‌డీఎంఏ


బయో మైనింగ్ ప్లాంటును పరిశీలిస్తున్న వరంగల్ ఆర్‌డీఎంఏ మసూద్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సిగ్నల్ కాలనీ సమీపంలో చెత్త డంపింగ్ యార్డులోని బయో మైనింగ్ ప్లాంటును గురువారం వరంగల్ రీజియన్ డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేటివ్ (ఆర్‌డీఎంఏ) మసూద్ సందర్శించారు. బయో మైనింగ్ ప్లాంటులో వ్యర్థాల నుంచి తయారయ్యే సేంద్రియ ఎరువుల ప్రక్రియ ఇప్పటి వరకు ఎంత ప్రాసెస్ అయిందని అడిగి తెలుసుకున్నారు. మిగిలింది కూడా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ టి.రాజేశ్వర్, డీఈ ఉపేందర్, ఏఈ కుమార్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ జి.క్రాంతి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులందరికీ అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని విద్యుత్ ఇంజనీర్స్ డైరెక్టర్ ఆపరేషన్ మధుసూదన్ అన్నారు. మహబూబాబాద్ విద్యుత్ శాఖ జిల్లా కార్యాలయంలో విద్యుత్ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం విద్యుత్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్, లైన్ల మరమ్మతుల జరిపే ముందు ఆయా ప్రాంతాల వినియోగదారులకు, అధికారులకు ముందస్తు సమాచారం అందించాలని సూచించారు. విద్యుత్ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సమించేది లేదని హెచ్చరించారు. చీఫ్ ఇంజనీర్ రాజు చౌహాన్, ఎస్ఈ విజయేందర్‌రెడ్డి, డీఈలు విజయ్, హిరాలాల్, సునిత, రవిశంకర్, ఏఈ సంగీతపాల్గొన్నారు.

దేవీనవరాత్రుల్లో అన్నదానం

కేసముద్రం, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం ఆర్యవైశ్య భవన్‌లో నిర్వహిస్తున్న దేవీనవరాత్రిఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారిని అన్నపూర్ణదేవి రూపంలో అలంకరించగా కొల్లూరు శంకరయ్య, ధనలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. రూ.35వేల వితరణతో 1500 మందికి అన్నదానాన్ని ఆయన కుమారులు కొల్లూరు రమేష్, శ్రీను చేశారు. సాయంత్రం 108 ప్రసాదాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో వాసవి మిత్రమండలి, శ్రీమాత వెల్ఫేర్ అసోసియేషన్ బాధ్యులు పాల్గొన్నారు.


మహబూబాబాద్ ఆర్టీసీ డిపో వద్ద బతుకమ్మ వేడుకలో డీఎం కల్యాణి, మహిళా ఉద్యోగులు


మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళా సిబ్బంది, మెప్మా ఆర్పీలు


మానుకోటలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

మానుకోటలో ఐదోరోజు బతుకమ్మ వేడుకలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా గురువారం ఐదోరోజు బతుకమ్మ వేడుకలను గురువారం మహిళలు ఘనంగా జరుపుకున్నారు.జిల్లాలోని దేవాలయాలు, చెరువుల వద్ద మహిళలు, యువతులు బతుకమ్మలను ఒకేచోట చేర్చి కోలాటం, ఉయ్యాల పాటలు పాడుతూ ఐదోరోజు అట్ల బతుకమ్మను ఆనందోత్సవాల నడుమ జరుపుకున్నారు. మరోపక్క ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆడారు. జిల్లాకేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి దేవాలయం, శ్రీభక్తమార్కండేయ ఆలయం, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం, శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయం, శ్రీరామాలయంతో పాటు వివిధ కాలనీల్లో ఉన్న ఆలయాల్లో బతుకమ్మ సంబురాలను జరుపుకుని ప్రసాదాలను పంపిణీ చేశారు.

●మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయం వద్ద మహిళా ఉద్యోగులు బతుకమ్మ పండుగను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ టి.రాజేశ్వర్, డీఈ ఉపేందర్, మెప్మా పీడీ విజయ, మేనేజర్ శ్రీధర్ పాల్గొన్నారు.

● ఆర్టీసీ డిపోలో డీఎం వి.కల్యాణి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఉత్సవాలకు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రుక్మిణి, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

● మహబూబాబాద్ నందన గార్డెన్స్‌లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సీఈ రాజుచౌహాన్, ఎస్ఈ విజయేందర్‌రెడ్డి, డీఈలు విజయ్, హిరాలాల్, సునిత, రవిశంకర్, ఏఈలు సంగీత, సిబ్బంది పాల్గొన్నారు.

● బయ్యారం : ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. గురువారం బయ్యారంలో అధికారులు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. తహసీల్, మండల పరిషత్ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఇన్‌చార్జి ఎంపీడీవో ద్వైవాదినంతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా బయ్యారంలో ఐదొద్దుల బతుకమ్మ వేడుకలు జరిగాయి. బయ్యారం శివాలయం, గాంధీ సెంటర్, రంగాపురం ముత్యాలమ్మ సెంటర్, బస్టాండ్ సెంటర్లలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

● డోర్నకల్ : డోర్నకల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం డోర్నకల్ మండలం పెరుమాండ్ల సంకీసలో బతుకమ్మ వేడుకలను అంగన్‌వాడీ సిబ్బంది, ఆయాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డోర్నకల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో లక్ష్మి మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతిక వైభవానికి ప్రతీక అని చెప్పారు. ప్రకృతి ఒడిలోని పూలను సేకరించి మహిళలు బతుకమ్మగా పేర్చి వేడుకలు నిర్వహించడం, కుల మతాలకు అతీతంగా బతుకమ్మ పండుగను అందరు జరుపుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేఖాభాయి, అంగన్‌వాడీ ఆయాలు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

● గార్ల : మండల పరిధిలోని శేరిపురం జీపీ దుబ్బతండాలో అంగన్వాడీ ఉద్యోగులు వైభవంగా బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను తయారు చేసి కిషోర్ బాలికలు, స్థానికులతో కలిసి ఆటపాటలు పాడుతూ డ్యాన్సులు చేస్తూ వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం సెక్టర్ సూపర్‌వైజర్ సంపూర్ణ, అంగన్వాడీ ఉద్యోగులు నాగమణి, స్వరుప, సీతా, మీనాబాయ్ పాల్గొన్నారు.

● కురవి : బతుకమ్మ తెలంగాణ సంప్రదాయ పండుగ అని, మహిళలు ఎంతో సంతోషంగా ఆనందోత్సాహాల నడుమ ఈ పండుగను జరుపుకుంటున్నారని మాజీ ఎంపీ మాలోత్ కవిత అన్నారు. కురవి యూత్ ఆధ్వర్యంలో జడ్పీఎస్ఎస్ క్రీడా మైదానంలో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో గురువారం ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో కవిత ముఖ్యఅతిథిగా పాల్గొని, మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. సద్దుల బతుకమ్మ, దసరా పండుగలను మహబూబాబాద్ జిల్లా ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కటికనేని హరిత, సంగెం రమ, సంగెం భరత్, వినోద్, ప్రదీప్, శరత్, వేమిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలి

మహబూబాబాద్ క్రైం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం కోసం వచ్చే వారికి మెరుగైన వైద్యం అందేలా కృషిచేసి, సీజనల్ వ్యాధుల పట్ల ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అన్నారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్‌తో కలిసి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని క్యాజువాలిటీ, ఏఎంసీ, ఐసీయూ, గైనకాలజీ, జనరల్ మెడికల్ వార్డులను సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం కోసం వచ్చే సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వైద్యసేవలు అందించాలని సూచించారు. ఆస్పత్రి పరిసరాలను, వార్డులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు చికెన్ గున్యా, మలేరియా, టైఫాయిడ్, విష జ్వరాలతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే వారికి వెంటనే పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారిని అడ్మిట్ చేసి, వైద్యం చేయాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ వార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాన ఆస్పత్రి వద్ద నిత్యం ఔట్‌పోస్టు సిబ్బంది ఉండాలని, ప్రజలకు వైద్యులకు రక్షణగా పోలీసు సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకొని, ఆస్పత్రి వద్ద తీసుకోవల్సిన చర్యలపై పట్టణ సీఐ జి.మహేందర్‌రెడ్డి, సిబ్బందికి సూచనలు చేశారు. ఆస్పత్రిలో చేపడుతున్న చర్యలపై ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్ కలెక్టర్, ఎస్పీకి వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉన్నారు.

బిల్లు చేయాలంటే లంచం తప్పదన్నాడు..

వరంగల్ క్రైం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లా కొడకండ్ల ప్రభుత్వ పాఠశాలలో సైన్స్‌ల్యాబ్ నిర్మాణం చేసిన కాంట్రాక్టర్ నుంచి రూ.8వేలు లంచం తీసుకుంటుండగా జనగామ సబ్‌డివిజన్‌కు చెందిన సైట్ ఇంజనీర్ (ఔట్ సోర్సింగ్) సామల రమేష్‌ను ఏసీబీ అధికారులు గురువారం హనుమకొండలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య కథనం ప్రకారం.. పీఎంశ్రీ స్కీంలో భాగంగా కొడకండ్ల జడ్పీహెచ్ఎస్‌లో సైన్స్‌ల్యాబ్ కోసం 2023-24లో రూ.13.5లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిర్మాణ పనులను కొడకండ్లకు చెందిన ఓ వ్యక్తి చేజిక్కించుకుని గత మార్చిలో పూర్తి చేశాడు. ఈ క్రమంలో తుది బిల్లును ప్రాసెస్ చేయడానికి సైట్ ఇంజనీర్ రూ.18వేలు లంచం అడిగాడు. దీంతో కాంట్రాక్టరు తొలుత రూ.10వేలను ఫోన్‌పే చేశాడు. మిగతా రూ.8వేలు కూడా కావాలని ఇంజనీర్ ఒత్తిడి చేయడంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో గురువారం హనుమకొండ డీఈఓ కార్యాలయం పైఅంతస్తులో ఉన్న రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఈడబ్ల్యూఐడీసీ) కార్యాలయంలో రూ.8వేలు తీసుకుంటుండగా సైట్ ఇంజనీర్ రమేష్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆయనపై కేసు నమోదు చేసి హనుమకొండలోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచామని డీఎస్పీ తెలిపారు.

దసరా ఉత్సవాలకు రూ.1.50 లక్షల విరాళం


పింగిలి శ్రీనివాస్‌కు రూ.1.50 లక్షల నగదు విరాళం అందిస్తున్న కొమ్మాల్‌నాయక్

గూడూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం దసరా వేడుకలను ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ సారి వేడుకల నిర్వహణ కోసం గూడూరుకు చెందిన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యువనాయకుడు వాంకుడోతు కొమ్మాలునాయక్ రూ.1.50 లక్షల నగదు విరాళాన్ని హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు పింగిలి శ్రీనివాస్‌కు అందించారు. ప్రతిసారి దసరా వేడుకల నిర్వహణ కోసం ప్రతిసారి తనవంతు ఆర్థిక విరాళం అందజేస్తూ వస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్‌రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ చంటిస్వామి, టౌన్ అధ్యక్షుడు రాసమల్ల యాకయ్య, నాయకులు ఎలమందల శ్రీనివాస్, రాసమల్ల రాములు, పొన్నం వెంకన్న, ఓర్సు రాజేందర్, సూర శ్రీను, తంగెళ్లపల్లి సునీల్, సాంబయ్య, వీరస్వామి పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి

గార్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మానుకోట జిల్లా కేంద్రంలో ఈనెల 28న జరిగే లంబాడీల ఆత్మగౌరవ సభను జిల్లాలోని లంబాడీలు రాజకీయాలకు అతీతంగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని గార్ల మాజీ సర్పంచ్ గంగావత్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. గురువారం లంబాడీ కుల సంఘాల ఆధ్వర్యంలో ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అజ్మీరా వెంకన్న, హర్జీనాయక్, సాయికుమార్, హమునాయక్, హరినాయక్, భీముడునాయక్, రవినాయక్ పాల్గొన్నారు.

మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయం

డోర్నకల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మహ్మద్ ప్రవక్త బోధనలు మానవుల మధ్య శాంతికి, సౌభ్రాతృత్వానికి పెంపొందిస్తాయని డోర్నకల్ మస్జీద్‌యే ఉస్మానియా పెషిమామ్ సుల్తాన్ అన్నారు. గురువారం డోర్నకల్‌లోని మస్జీద్‌యే ఉస్మానియాలో అంతిమ దైవప్రవక్త మహ్మద్ అందరివాడు కరపత్రాన్ని స్థానిక ముస్లిం మతపెద్దలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30న ఉదయం మహబూబాబాద్‌లో జరిగే మహ్మద్ ప్రవక్త బోధనలపై జరిగే ఉపన్యాసానికి ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

తహసీల్దార్ ఆఫీస్ ఎదుట డైలీవేజ్ వర్కర్ల నిరసన

నెహ్రూసెంటర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హాస్టల్‌లో పనిచేస్తున్న దినసరి కూలీలు గత 14 రోజులుగా సమ్మె చేస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధకరమన్నారు. 64 జీవోను వెంటనే రద్దు చేయాలని, టైంస్కేల్ ఇవ్వాలని, ఐదు సంవత్సరాలు పూర్తి చేసిన వర్కర్లను రెగ్యులర్ చేయాలని, 30 సంవత్సరాలుగా ఎలాంటి హక్కులు, కనీస వేతనాలు అమలు చేయకుండా వారితో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయించుకుంటుందన్నారు. తక్షణమే వారి సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా కన్వీనర్ కుర్ర మహేష్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న, పెనక ముత్తయ్య, భూక్య మహేష్, తాజోద్దీన్, హలావత్ లింగ్యా, నాగేశ్వర్‌రావు, సీతారాములు, రమేష్, అక్బర్, చంద్రయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాలోత్ కవిత

ఆత్మగౌరవ సభకు వేలాదిగా తరలిరావాలి

● మాజీ ఎంపీ మాలోత్ కవిత

నెహ్రూసెంటర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే కుట్రను తిప్పికొడుతూ.. ఈనెల 28న మానుకోటలో నిర్వహించే లంబాడీల ఆత్మగౌరవ సభకు వేలాదిగా తరలిరావాలని మానుకోట మాజీఎంపీ మాలోత్ కవిత పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో లంబాడ జేఏసీ నాయకులు ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా వారితో సమావేశమై ఆమె మాట్లాడారు. కొందరు తమ రాజకీయ స్వలాభం కోసం లంబాడీలపై విషం చిమ్ముతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లంబాడీల జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మానుకోటలో ఈనెల 28న నిర్వహించే ఆత్మగౌరవ సభ, ర్యాలీకి రాజకీయాలకు అతీతంగా లంబాడీలు, యువత, మేధావులు, కుటుంబ సమేతంగా హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ వైస్‌చైర్మన్ గుగులోతు కిషన్‌నాయక్, దారావత్ వెంకన్ననాయక్, గుగులోతు భీమానాయక్, బోడ రమేష్‌నాయక్, గుగులోతు రవినాయక్, బోడ లక్ష్మణ్‌నాయక్, వాంకుడోతు మంగీలాల్, కేలోతు అర్జున్‌చౌహాన్, హరిలాల్, లింగ్యా పాల్గొన్నారు.

మక్కలకు రూ.3 వేలు ధర చెల్లించాలి

మహబూబాబాద్ అగ్రికల్చర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్న(మక్కల)కు క్వింటాకు రూ.3 వేలు ధర పెట్టి ఖరీదు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గునిగంటి రాజన్న డిమాండ్ చేశారు. మహబూబాబాద్ మార్కెట్‌లో గురువారం తెలంగాణ రైతు సంఘం నాయకులు మొక్కజొన్నల నాణ్యత, ధరలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో మొక్కజొన్నలకు క్వింటాకు రూ.1800 నుంచి రూ.2 వేల వరకు ధరలు పెట్టి ఖరీదులు చేస్తున్నారని, దాంతో రైతులు నష్టపోతున్నారని ఆరోపించారు. తక్కువ ధర ఉండడం వల్ల రైతులు నిరాశ చెందుతున్నారని చెప్పారు. మార్కెట్ యార్డులో మరోవైపు పందుల బెడద, కోతుల బెడద విపరీతంగా ఉందని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వాటిని నియంత్రించాలని చెప్పారు. మొక్కజొన్నలకు ధరలు లేకపోవడంతో మార్క్‌ఫెడ్ సంస్థ రంగప్రవేశం చేసి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి క్వింటాకు రూ.3 వేల చొప్పున ఖరీదులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నల్లపు సుధాకర్, రైతులు ఇస్లావత్ వెంకన్న, బానోత్ శ్రీను, బానోత్ భద్రమ్మ, గుగులోతు అంజి, లచ్చిరాం, మూడ్ శ్రీను, రాంచంద్రు, రూప్లా పాల్గొన్నారు


కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో మహిళలకు పెద్దపీట

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో మహిళలకు పెద్దపీట వేస్తున్నామని, తద్వారా వారికి తగిన గౌరవం లభిస్తుందని మహిళా శిశు సంక్షేమ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన శ్రీవాణి ఎడ్యుకేషనల్ అండ్ సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో 'మన బతుకమ్మలను బతికించుకుందాం' అనే శీర్షికతో రూపొందించిన వాల్ పోస్టర్లను హైదరాబాద్ ప్రజాభవన్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో మహిళలకు తగిన గౌరవం ఇవ్వాలని చెప్పారు. మహిళలు అత్యుత్తమ ప్రతిభ కనపరుస్తూ అన్నిరంగాల్లో రాణించాలని సూచించారు. మహిళలపై పట్ల వివక్ష చూపవద్దని, దానిని విడనాడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ జిల్లా చైర్‌పర్సన్ నాగవాణి, సొసైటీ అధ్యక్షుడు పినాకపాణి పాల్గొన్నారు.

ఘనంగా దీన్‌దయాల్ జయంతి

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి) : అంత్యోదయ స్ఫూర్తి ప్రదాత, ఏకాత్మత మానవతావాదం సిద్ధాంత కర్త పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతిని గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వద్దిరాజు రామచందర్‌రావు, ప్రధాన కార్యదర్శులు చీకటి మహేష్‌గౌడ్, గడ్డం అశోక్, మదన్‌నాయక్ ఓర్సు పద్మావతి, పల్లే సందీప్, పెంటయ్య, రమేష్, కిషన్‌నాయక్, గణేష్, మంగమ్మ, దిలీప్, భరత్, వెంకన్న, సుధాకర్ పాల్గొన్నారు.

● ఇనుగుర్తి : మండల కేంద్రంలో గురువారం పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతిని బీజేపీ మండల అధ్యక్షుడు దుంపల సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దీన్‌దయాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా, మండల నాయకులు పొలెపల్లి వెంకటేశ్వర్లు, పసునూరు విష్ణు, కామినేటి బాలరాజు, గుజ్జునూరి నరేష్, కుల వెంకన్న, బోడ నరేష్, వల్లంల రాజేందర్, గోన శ్రీను, మందుల బాబు, వెంపటి సందీప్, సురేష్, సుధాకర్, రమేష్ పాల్గొన్నారు.


దీన్‌దయాల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు


ఏజన్సీలో నేలవాలిన మొక్కజొన్న పంట

నేలవాలిన మొక్కజొన్న పంట

బయ్యారం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : భారీగా కురుస్తున్న వర్షాలకు ఏజన్సీ ప్రాంతంలోని మొక్కజొన్న పంటకు తీవ్రనష్టం వాటిల్లుతోంది. కొన్ని రోజులుగా విస్తారంగా వర్షాలకు కురుస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి భారీగా కురిసిన వర్షానికి నారాయణపురం గ్రామపంచాయతీ రామచంద్రాపురం గ్రామంలోని బానోత్ తారచంద్, బుజ్జి, విజేందర్, హన్మంతులతో పాటు బయ్యారం గ్రామానికి దొమకొండ విజయ్‌లకు చెందిన మొక్కజొన్న పైరు నేలకొరిగింది. దీంతో పాటు వర్షాలకు పలు ప్రాంతాల్లో కూడా పంటలకు నష్టం వాటిల్లడంతో రైతులు ఆందోళ చెందుతున్నారు. కాగా, దెబ్బతిన్న పంట లను సర్వేచేసి రైతులను ఆదుకునేలా చర్యలు చేపట్టాలని రైతు సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

కురవి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నల్లపు సుధాకర్ అన్నారు. కురవిలో గురువారం నిర్వహించిన తెలంగాణ రైతు సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో వ్యవసాయ రంగాన్ని కాపాడాలని, పత్తిపంట దిగుమతిపై కేంద్రం విధించిన 11 శాతం సుంకాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసి పత్తిరైతులను కాపాడాలన్నారు. పత్తికి క్వింటాకు రూ.10075 చొప్పున కొనుగోలు చేయాలన్నారు. కొండబత్తుల వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కట్ల కృష్ణ, బత్తిని వీరభద్రం, పిట్టల ఉపేందర్, జగ్రాం, బాలునాయక్, చల్లగొల్ల మల్లయ్య, మాధవరావు, ఆమెడ చంద్రయ్య, రాంచంద్రు పాల్గొన్నారు.